సాక్షి మహబూబ్‌నగర్

బుధవారం । 5 । ఏప్రిల్ । 2023



నేటినుంచి సలేశ్వరం జాతర

నల్లమలలో వెలసిన సలేశ్వరం ఉత్సవాలు బుధవారం ప్రారంభం కానున్నాయి.

వివరాలు 8లో ▸



కన్ను పడితే కన్నమే..

నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటుచేసుకున్న చోరీలు ఆందోళనకు గురిచేస్తున్నాయి.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
37.4 /23.6

వాతావరణం

రోజంతా ఎండ తీవ్రత సాధారణంగా ఉంటుంది. అప్పుడప్పుడూ ఆకాశం తేలిక పాటి మేఘావృతమై ఉంటుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-36
(బుధవారం సాయంత్రం)

సహర్ 4-47
(గురువారం తెల్లవారుజామున)

పరిష్కారం చూపని సభలెందుకు?



మాట్లాడుతున్న రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, కలెక్టర్ రవినాయక్, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ సీతారామారావు తదితరులు



సమావేశానికి హాజరైన సభ్యులు, ఆయా శాఖల అధికారులు

- అధికారుల తీరుపై మండిపడిన జెడ్పీటీసీ సభ్యులు
- సమావేశానికి హాజరుకాకపోవడంపై అసహనం

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): గత సమావేశాల్లో సభ్యులు లేవనెత్తిన సమస్యలకు పరిష్కారం చూపకుండా మళ్లీ సమావేశాల్లో అవే సమస్యలు చెప్పడం ఆనవాయితీగా మారిందని జెడ్పీటీసీ సభ్యులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిష్కారం చూపని సమావేశాలు ఎందుకని ప్రశ్నించారు. మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి జరిగిన జెడ్పీ సమావేశానికి హాజరైన కలెక్టర్ రవినాయక్ చైర్‌పర్సన్ శాలువాతో సన్మానించి స్వాగతం పలికారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కావాల్సిన సభ 10.50 గంటలకు ప్రారంభమవగా.. తొలి ఎజెండాగా వ్యవసాయంపై చర్చించారు. ఈ క్రమంలో సభ్యులు వ్యవసాయ శాఖ అధికారికి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మూడు నెలలకోసారి జరిగే సమావేశాలకు కూడా అధికారులు హాజరు కాకపోతే ఎలా అని నిలదీశారు. ఈ క్రమంలో వ్యవసాయాధికారి చదువుతున్న ఎజెండాపై స్పందించిన సభ్యులు రైతుబంధు, రైతు బీమా అంశాలపై సమస్యలు లేవనెత్తారు. ఒకరి వెనక ఒకరు స్థానికంగా ఎదురయ్యే సమస్యలు అడగడంతో వ్యవసాయాధికారి కాస్త ఆవేశంగా సమాధానం ఇస్తున్న క్రమంలో జెడ్పీచైర్‌పర్సన్ కలుగజేసుకుని సభ్యులు అడిగిన ప్రశ్నలకు నిదానంగా సమాధానం ఇవ్వాలని సూచించారు. సమావేశంలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ సీతారామారావు, జెడ్పీసీఈఓ జ్యోతి, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు పాల్గొన్నారు.

సమష్టిగా పనిచేయాలి..

ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా పని చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి అన్నారు. జిల్లాను అన్నిరంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలన్నారు. వేసవి దృష్ట్యా గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని, సమావేశాల్లో సభ్యులు అడిగిన ప్రశ్నలకు తీసుకున్న చర్యలను వివరించాలని కోరారు.

- కలెక్టర్ రవినాయక్ మాట్లాడుతూ ధరణి వెబ్‌సైట్ రిజిస్ట్రేషన్‌కు వచ్చినప్పుడు ఎవరైనా ఆ భూమిపై రుణాలు చెల్లించినట్లయితే బ్యాంకులకు పూర్తిగా అప్పు చెల్లించినట్లు ఎన్‌ఓసీ తీసుకోవాలని, ఆ తర్వాతే రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు చెప్పారు.
- దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద మండలాలకు మంజూరైన రహదారులు, మెటీరియల్ కాంపెంసేషన్ కింద పూర్తయిన, అసంపూర్తిగా ఉన్న వాటికి సంబంధించి పూర్తి వివరాలు ఇవ్వాలన్నారు.

'పాలమూరు' 80 శాతం పూర్తి

పాలమూరు– రంగారెడ్డి పోత్తిపోతలలో భాగంగా చేపట్టిన ఉదండాపూర్, కర్వెన రిజర్వాయర్ల పనులు 80 శాతం పూర్తయ్యాయని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కాల్వల పనులు జరుగుతున్నాయని, వాటిని సైతం పూర్తిచేసి డిసెంబర్‌లోగా సాగునీరు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలోని అన్ని మండలాల సాగునీరు అందించి.. వలసలకు వెళ్లకుండా చూస్తామన్నారు.

అధికారులు రాకుంటే ఎట్ల..

జెడ్పీ సమావేశాలకు అధికారులు రాకుంటే సమస్యలు ఎవరికి చెప్పుకోవాలి. రైతుబంధు డబ్బులు అకౌంట్లలో పడిన వెంటనే పంట రుణాల పేరుతో కట్ చేసుకుంటున్నారు. రైతులకు మేలు చేయాలనే ఉద్దేశంతో అమలు చేస్తున్న ఈ పథకం బ్యాంకర్ల తీరుతో అభాసుపాలవుతోంది. ఎండాకాలం కావడంతో ఉపాధి హామీ కూలీలకు నీడను ఏర్పాటు చేయడంతోపాటు మంచినీళ్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలి.

– యాదయ్య, జెడ్పీ వైస్ చైర్మన్

ఆర్టీసీ బస్సు నడపాలి

జెడ్పీ సమావేశాల్లో సభ్యులు లేవనెత్తిన సమస్యల్లో ఒక్క దానికైనా పరిష్కారం చూపారా. గత సభలో వచ్చిన సమస్యలు పరిష్కరించిన తర్వాతే కొత్త ఎజెండా చదవాలి. మా మండలంలో వేముల– దాసరపల్లికి మధ్య ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి. వేముల పశువైద్య శాఖ శిథిలావస్థలో ఉంది. కొత్త భవనం మంజూరు చేయాలి.

– ఇంద్రయ్యసాగర్, జెడ్పీటీసీ సభ్యుడు, మూసాపేట

చిరుధాన్యాలపై అవగాహన

గండేడ్ మండలంలో కొనసాగుతున్న చిరుధాన్యాల యూనిట్‌పై గ్రామాల్లో ప్రచారం కల్పించాలి. చిరుధాన్యాలు పండించేందుకు రైతులు ముందుకు వచ్చేలా ప్రోత్సహించాలి. 8 గ్రామాలకు ఒకే గోపాలమిత్ర ఉన్నాడు. ఆయనకు మహబూబ్‌నగర్ నుంచే జీతం కేటాయించి పని చేయించుకోవాలి.

– శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు, గండేడ్

బిల్లుల పెండింగ్..

గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి సంవత్సరాల నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో కొత్త పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. రైతుబంధు, రైతు బీమా డబ్బులు పంట రుణాల పేరుతో బ్యాంకర్లు పట్టుకుంటున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదు.

– రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు, నవాబుపేట

'మిషన్ భగీరథ' నీళ్లు..

బాలానగర్ మండలంలో ప్రజలు తాగేందుకు మిషన్ భగీరథ నీళ్లు ఇవ్వని అధికారులు పరిశ్రమలకు ఇస్తున్నారు. ఉడిత్యాల గ్రామానికి మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని మూడేళ్ల నుంచి అధికారులకు, సభ దృష్టికి తెస్తున్నా ఏమాత్రం స్పందించడం లేదు. సమస్యలు పరిష్కరించకుంటే అధికారులు ఉండి ఏంలాభం.

– కల్యాణి, జెడ్పీటీసీ సభ్యురాలు, బాలానగర్

న్యూస్‌రీల్

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఎప్పటి నుంచో అమలుకు నోచుకోని విద్యుత్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జేఏసీ కన్వీనర్ చంద్రమౌళి అన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన విద్యుత్ ఉద్యోగుల జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ ఉద్యోగులకు 2022లో పీఆర్‌సీ ఇవ్వాల్సి ఉండగా ఏడాది గడిచినా ఇప్పటి వరకు అతీగతీ లేదన్నారు. విద్యుత్ ఉద్యోగులకు పీఆర్‌సీతోపాటు ఇతర సమస్యలు పరిష్కరించాని డిమాండ్ చేస్తూ గత నెల 24న హైదరాబాద్‌లో 35 వేల మంది ఉద్యోగులతో ధర్నా నిర్వహించినా ప్రభుత్వం స్పందించలేదని ఆరోపించారు. ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తెచ్చేందుకు ఈ నెల 17 నుంచి నిరవధిక సమ్మె చేపడుతామని, ఇప్పటికే యాజమాన్యానికి సమ్మె నోటీసులు ఇచ్చినట్లు వివరించారు. ఇందులో భాగంగా ఈ నెల 6న జిల్లాకేంద్రంలోని యూబీ గార్డెన్‌లో సమ్మె నిర్వహణపై సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశానికి ఉమ్మడి జిల్లా నుంచి విద్యుత్ ఉద్యోగులు హాజరు కావాలని కోరారు.

వేరుశనగ క్వింటా రూ.7,579

జడ్చర్ల: బాదేపల్లిలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం వేరుశనగ క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.7,579, కనిష్ఠంగా రూ.4,209 చొప్పున వచ్చింది. అలాగే మొక్కజొన్నకు గరిష్ఠంగా రూ.2,111, కనిష్ఠంగా రూ.1,759, జొన్న గరిష్ఠంగా రూ.4,633, కనిష్ఠంగా రూ.4,233, పొద్దుతిరుగుడు గరిష్ఠంగా రూ.4,809, కనిష్ఠంగా రూ.4,763, చింతగింజలు రూ.1,651, ఆముదాలు గరిష్ఠంగా రూ.6,124, కనిష్ఠంగా రూ.5,614 లభించాయి.

పీయూలో జాబ్‌మేళాకు 75మంది హాజరు



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పీయూలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాకు 75 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 66 మంది రాత పరీక్షకు అర్హత సాధించగా, చివరకు 60 మంది డెమో ఇచ్చే దశకు చేరుకున్నారు. హైదరాబాద్‌లోని శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో ఉపాధ్యాయులుగా పనిచేసేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు పీయూ ప్లేస్‌మెంట్ అధికారి డా.ఎస్.ఎన్.అర్జున్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా పీయూ కళాశాల ప్రిన్సిపాల్ కిశోర్ మాట్లాడుతూ అభ్యర్థులకు ఆత్మవిశ్వాసం, కమ్యూనికేషన్ స్కిల్స్‌తో పాటు సబ్జెక్టుపై పట్టుదల ఉంటే విజయం వరిస్తుందన్నారు. శ్రీ చైతన్య టెక్నో స్కూల్ అకాడమి కోఆర్డినేటర్ మాట్లాడుతూ వారం రోజుల్లో ఎంపికైన వారి జాబితా వెల్లడిస్తామన్నారు. కార్యక్రమంలో పీయూ వీసీ ఎల్.బి.లక్ష్మీకాంత్‌రాథోడ్, రిజిస్ట్రార్ డా.మంగతాయారు, సీఓఈ రాజ్‌కుమార్, వైస్‌ప్రిన్సిపాల్ కృష్ణయ్య పాల్గొన్నారు.

వైద్య పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

బిజినేపల్లి: జిల్లాలో ఖాళీగా ఉన్న 36 వైద్యుల పోస్టులకుగాను కాంట్రాక్టు పద్ధతిన భర్తీకి మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్ తెలిపారు. ఆయా పీహెచ్‌సీలకు, పట్టణ ఆరోగ్య కేంద్రాలకు, పల్లె దవాఖానాలకు వైద్యుల్ని నియమించనున్నట్లు తెలిపారు. అలాగే, పలెటీవ్ కేర్, ఐటీడీ, మన్ననూర్, ఆర్‌బీఎస్‌కేలో ఖాళీ పోస్టులకు సైతం ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. మొత్తం 36 స్థానాలకు వైద్యులను ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేశామని, వారికి కేటాయించిన స్థానాల్లో త్వరలో విధుల్లో చేరుతారన్నారు.

'గద్వాల'లో గలాటా

బీసీ కుంపట్లు..!

- బీఆర్‌ఎస్‌లో తారాస్థాయికి అంతర్గత పోరు
- ముఖ్యనేత వ్యవహార శైలిపై విమర్శలు
- వెనకబడిన వర్గాల్లో చీలికే లక్ష్యంగా పావులు..
- ప్రధాన ప్రతిపక్షంతో కలిసి ఓ యాత్రకు అండదండలు?
- అణగదొక్కుతున్నారని అధిష్టానానికి ఫిర్యాదుల వెల్లువ



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ఉమ్మడి పాలమూరులో గద్వాల రాజకీయాలే వేరు.. నేతలే స్వయంగా వర్గాలను పెంచి పోషించడం.. వినేంత వరకు వారి ద్వారా హవా కొనసాగించడం.. వినిపించుకోని పక్షంలో తెరమరుగు చేయడం ఇక్కడి ఆనవాయితీ. ఎప్పుడూ ఏదో ఒక 'ప్రత్యేక'తను చాటుకునే ఆ నియోజకవర్గంలో తాజా రాజకీయ పరిణామాలు హాట్‌టాపిక్‌గా మారాయి. ముఖ్యంగా బీఆర్‌ఎస్‌లో కీలకనేతకు అదే పార్టీలోని బీసీ నేత రూపంలో గట్టి పోటీ ఎదురుకావడంతో పాటు తొలి నుంచీ ఇరువురి మధ్య విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి. అంతర్గత పోరు తీవ్రస్థాయికి చేరగా..రాజకీయాలు కొత్త పుంతలు తొక్కాయి. ఆత్మీయ సమ్మేళనాలకు ఆహ్వానం లేకపోవడం పక్కకు పెడితే.. ఇదే సమయంలో సెగ్మెంట్ పరిధిలో ఓ పోరాట సమితి నాయకుడు యాత్ర చేపట్టడం.. దీని వెనుక అధికార పార్టీలోని ముఖ్య నేతే ఉన్నట్లు.. ప్రధాన ప్రతిపక్ష నేతలతో కలిసి లోపాయికారి ఒప్పందంతో ఆ యాత్రకు ఆయన చేయూత అందిస్తున్నట్లు స్థానిక ప్రజల్లో చర్చ జోరుగా సాగుతోంది. ఈ క్రమంలో అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీల్లో బీసీ కుంపటి రాజుకోగా.. ముఖ్యనేత వ్యవహారశైలిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆత్మీయ సమ్మేళనాలతో మరింత దూరం..

ఎన్నికలు సమీపిస్తున్న వేళ పార్టీ నాయకుల మధ్య సఖ్యతతో పాటు శ్రేణుల్లో ఉత్సాహం నింపుతూ.. ప్రజలను చేరువ చేసుకోవాలనే లక్ష్యంతో బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఆత్మీయ సమ్మేళనాలకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. కానీ.. గద్వాల నియోజకవర్గంలో పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. ఆత్మీయ సమ్మేళనాలు నేతల మధ్య మరింత వైరం ముదిరేలా చేసినట్లు తెలుస్తోంది. ప్రధానంగా బీఆర్‌ఎస్‌లోని బడుగు, బలహీన వర్గాల నేతలకు ఆహ్వానం లేకపోవడమే ఇందుకు కారణమని శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. జెడ్పీ చైర్‌పర్సన్ సరితతో పాటు శాట్స్ చైర్మన్ ఆంజనేయగౌడ్, జెడ్పీ మాజీచైర్మన్ బండారి భాస్కర్ తదితర నాయకులు ఆత్మీయ సమ్మేళనాలకు దూరంగా ఉండడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది.

కేటీఆర్‌కు జెడ్పీ చైర్‌పర్సన్ ఫిర్యాదు..

ఆత్మీయ సమ్మేళనాలకు అలంపూర్ నుంచి మాత్రమే ఆహ్వానాలు అందుతున్నాయని.. ఈ నియోజకవర్గంలోని మండలాల్లో జరుగుతున్న కార్యక్రమానికి తప్పకుండా హాజరవుతున్నానని.. గద్వాల నియోజకవర్గంలో మాత్రం తనను ఆహ్వానించకుండా అవమానం చేస్తున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్‌కు ఫిర్యాదు చేశారు. మరోవైపు ముఖ్యనేత అన్నీ తానై నిర్వహిస్తున్న కార్యక్రమానికి తనను ఆహ్వానించకపోవడంపై ఉమ్మడి జిల్లాలో జెడ్పీచైర్మన్‌గా పనిచేసిన బండారి భాస్కర్ సైతం ఆత్మీయ సమ్మేళనానికి సంబంధించి నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి తక్కళ్లపల్లి రవీందర్‌రావుతో వాగ్వాదానికి దిగారు. ఇది ఏమైనా ఆయన ఇంట్లో శుభకార్యమా? బొట్టుపెట్టి పిలవడానికి? అందరూ చొచ్చుకుని రావాలి' అని ఆయన సూచించగా.. బడుగు, బలహీన వర్గాల నేతలను ఇప్పటికే పిలవకుండా అవమానిస్తోంది చాలదా? ఆహ్వానం లేకుండా వెళ్తే కుర్చీలు లేకుండా చేసి మరింతగా అవమానపరుస్తారు అని ఆవేదన వ్యక్తం చేయడం పరిస్థితులను తేటతెల్లం చేస్తున్నాయి.

బీసీ నేతల రహస్య భేటీ..

తాను చెప్పింది వింటూ తలాడించే వారికే బీఆర్‌ఎస్‌లో ముఖ్యనేత ప్రాధాన్యమిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తనకు రాజకీయంగా పోటీ వస్తారనే అనుమానం ఉన్న వారిని పార్టీలో అణచివేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని బీసీ, ఎస్సీ వర్గాలకు చెందిన కీలక నేతలు, పలు మండలాలకు చెందిన జెడ్పీటీసీ సభ్యులు, యువ నాయకులు పలు సందర్భాల్లో ఆవేదన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఆత్మీయ సమ్మేళనాలకు ఆహ్వానించకుండా అవమానించడం.. ఓ పోరాట సమితి యాత్ర వెనుక ప్రధాన ప్రతిపక్షం, ముఖ్య నేత ఉన్నట్లు ప్రచారం జరుగుతున్న క్రమంలో బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు బీసీ, ఎస్సీ నేతలు ఇటీవల హైదరాబాద్‌లో రహస్యంగా భేటీ అయినట్లు సమాచారం. పార్టీ పరిస్థితులు, బీసీ, ఎస్సీ వర్గాల అణచివేతను ఎదుర్కొనే తీరు.. ఏకతాటిపై నిలిచేలా చేపట్టాల్సిన కార్యచరణపై చర్చించినట్లు తెలిసింది. త్వరలో బడుగు, బలహీన వర్గాలకు చెందిన కీలక నేతలతో పాటు మండలాలకు చెందిన ముఖ్యులతో మరోసారి భేటీ నిర్వహించనున్నట్లు వినికిడి. ఈ క్రమంలో గద్వాలలో ఏం జరుగుతోందనే ఆసక్తి సర్వత్రా నెలకొంది.

సెగ్మెంట్‌లో బీసీలే అధికం..

గద్వాల అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 2,34,633 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో సుమారుగా 45వేల మంది బోయలు, 40 వేల మంది కురువ, 30వేల మంది ఎస్సీలు, 20 వేల మంది ముస్లింలు, 15వేల మంది ముదిరాజ్‌లు, 16వేల మంది మున్నూరు కాపు, పద్మశాలీలు 8 వేలు, యాదవులు 8 వేలు, గౌడ్స్ 5 వేలు, మంగలి 3 వేలు, ఆర్యవైశ్యులు 8 వేలు, రెడ్డి 9 వేలు, లంబాడీలు 7 వేలు, బ్రాహ్మన్లు 3 వేల మందితో పాటు కుమ్మరి, ఉప్పరి, స్వకుల శాలి, ఆరెకటిక, కమ్మరి, వడ్డెర, చాకలి తదిత కులాలకు చెందిన వారు ఉన్నారు. ఇందులో 65శాతానికిపైగా బీసీలే ఉండగా.. రాజకీయంగా శాసించగలిగే స్థితిలో ఉన్నారు. 1957 నుంచి ఇప్పటివరకు 15 పర్యాయాలు ఎన్నికలు జరగగా.. 1999లో వెనుకబడిన వర్గానికి చెందిన గట్టు భీముడు మాత్రమే గెలుపొందారు. తాజాగా బీసీ వాదం తెరపైకి వస్తున్న క్రమంలో రాజకీయ పరిణామాలను ప్రధాన రాజకీయ పార్టీలు నిశితంగా పరిశీలిస్తున్నట్లు.. ఇంటెలిజెన్స్ వర్గాల ద్వారా నివేదికలు తెప్పించుకుంటున్నట్లు సమాచారం.

పకడ్బందీగా 'పది' పరీక్షల నిర్వహణ

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాలో పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ రవినాయక్ అన్నారు. మంగళవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన హైదరాబాద్ నుంచి కలెక్టర్లు, విద్యాశాఖ, పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి పరీక్ష కేంద్రంలో ఇద్దరు జిల్లా అధికారులతోపాటు ఒక ఎంపీడీఓ, తహసీల్దార్‌ను సిట్టింగ్ స్క్వాడ్‌గా నియమించామని చెప్పారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లను అనుమతించడం లేదని, చీఫ్ సూపరింటెండెంట్, ఇన్విజిలేటర్లు, తనిఖీ అధికారుల ఫోన్లను కూడా డిపాజిట్ చేసుకున్న తర్వాత కేంద్రంలోకి అనుమతిస్తున్నామన్నారు. జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ మాట్లాడుతూ జోన్ పరిధిలోని 5 జిల్లాల్లో పరీక్షల సందర్భంగా తీసుకోవాల్సిన ఏర్పాట్లపై ఇది వరకే ఎస్పీలకు ఆదేశాలు జారీచేశామన్నారు. ఎస్పీ కె.నరసింహ మాట్లాడుతూ జిల్లాలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను రెండుసార్లు సందర్శించేలా ప్రణాళిక రూపొందించామన్నారు. ప్రహరీ లేని కేంద్రాల వద్ద మరింత అప్రమత్తంగా ఉంటున్నట్లు చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సీతారామారావు, డీఈఓ యాదయ్య, పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

మాయగాళ్లు..!

- జిల్లాలో విచ్చలవిడిగా కొనసాగుతున్న సెటిల్‌మెంట్ రాయుళ్లదందా
- మంత్రాలు, మాయలతో అమాయకులకు బురిడీ
- వరస ఘటనలు చోటుచేసుకుంటున్నా పట్టని పోలీసు అధికారులు
- చోద్యం చూస్తూ నేరస్తులకే సహకరిస్తున్నారన్న ఆరోపణలు



సాక్షి, నాగర్‌కర్నూల్: జిల్లాలో మంత్రాలు, మాయలు చేస్తామంటూ అమాయకులను బురిడీ కొట్టిస్తున్న కేటుగాళ్ల బాగోతాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. జిల్లాకేంద్రంలో తరచుగా చోటుచేసుకుంటున్న ఘటనలపై బాధితులు నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు పోలీస్‌స్టేషన్ల చుట్టూ నెలల తరబడి తిరిగినా ఫలితం ఉండటం లేదని బాధితులు ఆందోళన చెందుతున్నారు. తన మంత్రశక్తితో దూరమైన భార్యాభర్తలను కలుపుతానంటూ మహిళను నమ్మించి రూ.లక్షలు విలువైన భూములను రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఘటన తాజాగా వెలుగు చూసింది. మోసపోయానని గ్రహించిన బాధితురాలు తనకు న్యాయం చేయాలంటూ జిల్లా ఎస్పీ మనోహర్‌ని కలిసి ఫిర్యాదు చేసింది.

మంత్రాలు, మాయలు అంటూ..

జిల్లాలో మంత్రాలు, మాయలు చేస్తామంటూ నమ్మబలుకుతూ అమాయకుల నుంచి అందినకాడికి దండుకుంటున్న మాయగాళ్ల దందా విచ్చలవిడిగా కొనసాగుతోంది. మాయగాళ్ల చేతుల్లో నష్టపోయిన బాధితులు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలోని వంగూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళకు ఆమె భర్తతో కొన్నాళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. జిల్లాకేంద్రానికి చెందిన రామెట్టి సత్యనారాయణ తాను మంత్రాలు చేసి భార్యాభర్తలను కలుపుతానని నమ్మబలికాడు. ఇందుకోసం మహిళ పేరిట భూమి, ఆస్తులు ఉంటే పని జరగదని చెప్పి తన పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని ఒప్పించాడు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల సబ్‌రిజిస్ట్రార్ పరిధిలో సదరు మహిళకు ఉన్న రెండు ప్లాట్లను సత్యనారాయణ పేరిట, అతని బంధువుల పేరిట రిజిస్ట్రేషన్ చేయించాడు. విషయం భర్తకు చెప్పిన తర్వాత తాము మోసపోయామని తెలుసుకున్న భార్యభర్తలు ఎస్పీని కలసి ఫిర్యాదు చేశారు. సత్యనారాయణపై ఫిర్యాదు చేసినా పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు.

విచారణ పేరుతో కాలయాపన..

నాగర్‌కర్నూల్ మండలం గన్యాగులకు చెందిన లింగస్వామి(50)కి రామెట్టి సత్యనారాయణ 2013లో 130 గజాల ప్లాటును విక్రయించాడు. తర్వాత లింగస్వామితో పరిచయం పెంచుకున్న సత్యనారాయణ.. లింగస్వామి చిన్న కుమారుడు శివశంకర్‌కు బ్యాంకులో క్లర్కు ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికాడు. ఇందుకు తనకు రూ.2 లక్షలు ఇవ్వాలని, లేదంటే ప్లాటును మార్టిగేజ్ చేయాలని ఒప్పించాడు. 2022 నవంబర్ 7న తన బంధువు మహేశ్ పేరిట భూమిని మార్టిగేజ్ కాకుండా రిజిస్ట్రేషన్ చేయించాడు. తర్వాత పది రోజులకే 2022 నవంబర్ 17న లింగస్వామి వనపట్ల శివారులో దారుణ హత్యకు గురయ్యాడు. లింగస్వామి హత్యకు సంబంధించి ఇప్పటివరకు పోలీసులు నిందితులను పట్టుకోలేదు. పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారని మృతుని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. జిల్లా కేంద్రానికి చెందిన మహ్మద్ పాషా శ్రీపురం రోడ్డులో డబ్బాను ఏర్పాటుచేసుకుని చిన్నపిల్లలకు తాయత్తులు కడుతుండేవాడు. తన వద్దకు వచ్చే మహిళకు మాయమాటలు చెప్పి లోబర్చుకున్నాడు. ఆమెకు సంబంధించిన వీడియోలు తన వద్ద ఉన్నాయని, సోషల్ మీడియాలో పెడుతానంటూ బెదిరించి పెద్దఎత్తున నగదు వసూలు చేశాడు. అతని వేధింపులకు తాళలేక సదరు మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పదిరోజులు గడుస్తున్నా ఇప్పటివరకు పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకోలేదు. నిందితులను పట్టుకోవడంలో పోలీసులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నెలలు గడిచినా స్పందన లేదు..



జిల్లాకేంద్రానికి చెందిన సత్యనారాయణ నాకు బ్యాంకులో ఉద్యోగం ఇప్పిస్తానని, భూమిని మార్టిగేజ్ చేయించాలని చెప్పి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. తర్వాత పదిరోజులకే మా నాన్న హత్యకు గురయ్యాడు. మాకు వేరే ఎవరితో గొడవలు లేవు. నిందితులను పట్టుకోవాలని ఇప్పటికీ పలుమార్లు పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదు. పోలీసులు విచారణ చేపట్టి నిందితులను బయటపెట్టాలి.

– శివశంకర్, గన్యాగుల

విచారణ చేపట్టాం..

బాధితుల నుంచి అందిన ఫిర్యాదుపై విచారణ కొనసాగుతోంది. అన్ని కోణాల్లో దర్యాప్తు సాగుతోంది. ప్రతి కేసును లోతుగా విచారణ చేపడుతున్నాం. త్వరలోనే విచారణ పూర్తిచేస్తాం.

–మోహన్‌కుమార్, డీఎస్పీ, నాగర్‌కర్నూల్

12,503 మంది విద్యార్థులు హాజరు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ఆయా కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు కొనసాగుతున్నాయి. ఈ మేరకు మంగళవారం రెండోరోజు హిందీ పరీక్ష జరగగా.. 12,503 మంది విద్యార్థులు హాజరవగా.. మరో 64 మంది గైర్హాజరయ్యారు. కలెక్టర్ రవినాయక్ రెండు పరీక్ష కేంద్రాలను, డీఈఓ యాదయ్య 7 పరీక్ష కేంద్రాలను, స్క్వాడ్ అధికారులు 24 పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

సెల్‌ఫోన్‌తో పరీక్షకేంద్రంలోకి స్క్వాడ్

జడ్చర్ల: రాష్ట్రంలో 10వ తరగతి ప్రశ్నపత్రాల లీకేజీ రోజురోజుకు వివాదాస్పదంగా మారుతున్న సమయంలో ఓ పరీక్ష కేంద్రంలో స్క్వాడ్‌గా విధులు నిర్వర్తిస్తున్న అధికారి నిబంధనలకు విరుద్ధంగా తన మొబైల్ ఫోన్ వినియోగిస్తున్న విషయాన్ని గమనించిన డీఈఓ యాదయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక కావేరమ్మపేట జెడ్పీహెచ్‌ఎస్ పరీక్ష కేంద్రంలో చోటు చేసుకుంది. పరీక్ష కేంద్రంలో నిబంధనల మేరకు ఇన్విజిలేటర్లు, అధికారులు, ఇతర సిబ్బంది సెల్‌ఫోన్‌లు వినియోగించొద్దు. కాగా.. డీఈఓ యాదయ్య పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసేందుకు వచ్చిన సమయంలో సిట్టింగ్ స్క్వాడ్‌గా విధులు నిర్వర్తిస్తున్న జడ్చర్ల తహసీల్దార్ లక్ష్మీనారాయణ కేంద్రం ఆవరణలో ఫోన్‌లో మాట్లాడుతున్న విషయాన్ని గమనించారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన డీఈఓ ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.



మహబూబ్‌నగర్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

క్లుప్తంగా

రైలు ఢీకొని ఒకరు మృతి

గద్వాల క్రైం: ప్రమాదవశాత్తు గుర్తు తెలియని రైలు ఢీకొని ఒకరు మృతిచెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ తెలిపారు. సోమవారం రాత్రి దౌదర్‌పల్లి కాలనీకి చెందిన వెంకట్రాములు(58) గద్వాల–రాయిచూర్ రైల్వే ట్రాక్ వైపు వెళ్లాడు. పట్టాలు దాటే సమయంలో ప్రమాదవశాత్తు రైలు ఢీకొని మృతిచెందినట్లు తెలిపారు. రైల్వే సిబ్బంది మృతదేహాన్ని గుర్తించి సమాచారం ఇవ్వగా, పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి బంధువులకు సమాచారం అందించామన్నారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

యువకుడి బలవన్మరణం


రాజు (ఫైల్)

మన్ననూర్: కుటుంబ సమస్యలతో విసుగు చెందిన ఓ చెంచు యువకుడు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మన్ననూర్‌లో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. అమ్రాబాద్ మండలం మన్ననూర్‌లోని లింగమయ్యకాలనీకి చెందిన కాట్రాజు రాజు(30) భార్యాభర్తల మధ్య మనస్పర్థలు వచ్చాయి. దీంతో రాజు భార్య తన అమ్మగారి ఊరిలో ఉంటుండగా.. రాజు మాత్రం మన్ననూర్‌లోనే ఉంటున్నాడు. భార్యాపిల్లలు దూరం ఉండటంతో ప్రతినిత్యం మద్యం తాగుతుండేవాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం ఉదయం స్థానికులు గమనించగా అప్పటికే మృతిచెందాడు. రాజు తల్లిదండ్రులు గతంలోనే మృతిచెందగా.. భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు.

పోలేపల్లిలో మరొకరు..

జడ్చర్ల: మండలంలోని పోలేపల్లికి చెందిన బండమీదిపల్లి శివ(34) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి సీఐ రమేష్‌బాబు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన శివకు ఎనిమిదేళ్ల క్రితం కల్వకుర్తికి చెందిన కవితతో వివాహమైంది. అయితే భార్యాభర్తలు కల్వకుర్తిలోనే అత్తగారి ఇంట్లో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. తరుచుగా పోలేపల్లిలోని తల్లి దగ్గరికి వచ్చిపోయే శివ ఆదివారం సైతం వచ్చాడు. అకస్మాత్తుగా సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి పక్కన ఉన్న వేపచెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయమై తన కుమారుడు ఆత్మహత్యకు కారణాలు తెలుసుకుని న్యాయం చేయాలని తల్లి వెంకటమ్మ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ వివరించారు.

నేటి నుంచి సలేశ్వరం జాతర

- నల్లమల లోతట్టు ప్రాంతంలో కొలువుదీరిన లింగమయ్య
- మూడు రోజుల పాటు కొనసాగనున్న ఉత్సవాలు
- లక్షలాదిగా తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికార యంత్రాంగం

మన్ననూర్/కందనూలు: దట్టమైన నల్లమల అడవి లోతట్టు ప్రాంతంలో వెలసిన సలేశ్వరం లింగమయ్య ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇప్పటికే వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా బస్సులను నడిపిస్తోంది. అలాగే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా అధికారులు అన్నిరకాల సౌకర్యాలు కల్పిస్తున్నారు. అలాగే ఉత్సవాలపై కలెక్టర్ ఉదయ్‌కుమార్ సమీక్ష నిర్వహించగా.. ఆర్టీసీ ఆర్‌ఎం శ్రీదేవి ప్రయాణ రూట్లను పరిశీలించారు. అడవిలో పాటించాల్సిన నిబంధనలపై అటవీ శాఖాధికారులకు భక్తులకు అవగాహన కల్పిస్తున్నారు.


సలేశ్వరం లోయలో లింగమయ్య

భక్తులను అడ్డుకున్న అటవీ అధికారులు


ఫర్హాబాద్ వద్ద సలేశ్వరం భక్తులను అడ్డుకుంటున్న అటవీశాఖ అధికారులు

సలేశ్వరం జాతరకు వెళ్లేందుకు మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులను అటవీశాఖ అధికారులు, సిబ్బంది ఫర్హాబాద్ చౌరస్తా వద్ద మంగళవారం అడ్డుకున్నారు. వివరాలిలా.. గతంలో నల్లమల లోతట్టు ప్రాంతంలోని సలేశ్వరం ఉత్సవాలు చెంచుల సమక్షంలో వారంరోజులపాటు కొనసాగేవి. అయితే గత ఐదేళ్లుగా పులుల రక్షిత అభయారణ్యం పేరిట అటవీ శాఖ అధికారులు జనసంచారాన్ని కొంత కట్టడి చేశారు. దీంతో సలేశ్వరం, లొద్ది మల్లయ్య, భౌరాపూర్ ఉత్సవాలను సైతం పేరుకు మాత్రం చెంచులను ముందు చూపెడుతూ అటవీశాఖ కనుసన్నల్లోనే ఉత్సవాలు జరుగుతుండటం గమనార్హం. ఈ క్రమంలోనే బుధవారం నుంచి జరగనున్న సలేశ్వరం ఉత్సవాలకు ఉన్నతాధికారులు 3 రోజులు మాత్రమే అనుమతి ఇచ్చారు. ఈ విషయం తెలియని దూర ప్రాంతాలకు చెందిన భక్తులు మంగళవారం మధ్యాహ్నం సలేశ్వరం వెళ్లేందుకు పెద్దఎత్తున తరలివచ్చారు. దీంతో అనుమతి లేదని అటవీశాఖ అధికారులు, సిబ్బంది భక్తులను అడ్డుకోవడంతో స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. బుధవారం ఉదయం 7 గంటల నుంచి అనుమతి ఇస్తామని అధికారులు తేల్చిచెప్పడంతో భక్తులు నిరాశతో వెనుదిరిగారు.

ప్రత్యేక బస్సులు..

సలేశ్వరం లింగమయ్య జాతరకు ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు నాగర్‌కర్నూల్ డిపో మేనేజర్ ధరంసింగ్ తెలిపారు. సలేశ్వరం జాతరను పురస్కరించుకొని మంగళవారం జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ డిపోలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. బుధవారం నుంచి మూడురోజులపాటు జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రత్యేక ప్లాట్‌ఫాం నుంచి సలేశ్వరానికి బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. నాగర్‌కర్నూల్ నుంచి సలేశ్వరానికి చార్జీ పెద్దలకు రూ.200, పిల్లలకు రూ.100 ఉంటుందన్నారు. ఘాట్ రోడ్డులో శిక్షణ పొందిన డ్రైవర్లు, పూర్తిస్థాయి కండీషన్ ఉన్న బస్సులు, బస్టాండ్ నుంచి ప్రతి 15 నిమిషాలకు ఒకటి చొప్పున బస్సు అందుబాటులో ఉంటాయని చెప్పారు. 30 మంది ప్రయాణికులు ఉన్న చోటికి బస్సులనే పంపిస్తామని, ప్యాకేజీ టూర్లకు బస్సులను అద్దెకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది నారాయణ, చంద్రయ్య, సేఫ్టీ వార్డెన్ సత్యం తదితరులు పాల్గొన్నారు.


అటవీ ప్రాంతంలోని మల్లాపూర్ వద్ద ఆర్‌ఎంతో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది

పకడ్బందీగా ఏర్పాట్లు

కలెక్టర్ ఉదయ్‌కుమార్ ఆదేశం

నాగర్‌కర్నూల్: నల్లమలలోని సలేశ్వరం జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ మోతీలాల్, ఏఎస్పీ రామేశ్వర్, డీఎఫ్‌ఓ రోహిత్ గోపిడి, సలేశ్వరం ఆలయ కమిటీ సభ్యులతో ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సలేశ్వరం జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదని, రాత్రివేళల్లో నడిచే భక్తులకు అన్నిరకాల సౌకర్యాలు కల్పించాలన్నారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ఫర్హాబాద్ నుంచి లోపలికి అనుమతిస్తామని చెప్పారు. జాతరకు వచ్చే భక్తులకు సౌకర్యార్థం రాత్రివేళల్లో భక్తులు నడిచేలా సోలార్ లైట్లు ఏర్పాటు చేయాలని గిరిజన సంక్షేమ శాఖ అధికారి అనిల్‌ప్రకాష్‌ను ఆదేశించారు. కండిషన్‌లో ఉన్న ఆర్టీసీ బస్సులు మాత్రమే ఏర్పాటు చేయాలన్నారు. వైద్య శాఖ తరపున 3 చోట్ల ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేయాలని, కింద గుండం వద్ద వైద్య సిబ్బంది, ఒక వైద్యుడు అన్నిరకాల సదుపాయాలతో సిద్ధంగా ఉండాలన్నారు. ఎండల తీవ్రత ఎక్కువ ఉన్నందున 30 సింటెక్స్ ట్యాంకులతో తాగునీరు అందించాలన్నారు. సమావేశంలో ఇమ్యూనైజేషన్ అధికారి రవినాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

అధికారులకు ఆర్‌ఎం సూచనలు

సలేశ్వరం ఉత్సవాలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం వివిధ డిపోల నుంచి నడుపుతున్న ఆర్టీసీ బస్సు సర్వీసుల రాకపోకలను తెలుసుకునేందుకు మహబూబ్‌నగర్ ఆర్‌ఎం శ్రీదేవి మంగళవారం నల్లమలలో పర్యటించారు. ఈ సందర్భంగా అటవీ ప్రాంతంలోని దారి మొత్తం పరిశీలించిన ఆమె రాంపూర్ వద్ద బస్సులు నిలుపు స్థలాన్ని అధికారులకు పలు సూచనలు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆమె వెంట అచ్చంపేట డిపో మేనేజర్ రాజశేఖర్, సీఐ బాబునాయక్, చంద్రయ్య, బాలస్వామి తదితరులున్నారు.

గుండెపోటుతో బాలింత మృతి


నీరజ (ఫైల్)

మానవపాడు: గుండెపోటుతో ఓ బాలింత మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలోని బోరవెల్లిలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వెంకటమ్మ, సరోజమ్మ దంపతుల పెద్ద కుమార్తె నీరజ(21)ను అదే గ్రామానికి చెందిన మధుకు ఇచ్చి ఏడాది క్రితం వివాహం చేశారు. వీరికి నాలుగు నెలల క్రితం ఓ బాబు పుట్టాడు. ఈ క్రమంలో ఆమె తల్లిగారి ఇంటి వద్ద ఉండగా సోమవారం అర్ధరాత్రి గుండెపోటు రావడంతో మృతిచెందింది. దీంతో మంగళవారం అంత్యక్రియలు పూర్తిచేశారు. బాబు పుట్టి నాలుగు నెలలు కాక ముందే తల్లి మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఖిల్లాఘనపురంలో వ్యక్తి..

ఖిల్లాఘనపురం: మండల కేంద్రానికి చెందిన కంబు తిరుపతయ్య(40) మంగళవారం సాయంత్రం గ్రామంలోని ఓ వైన్‌షాపు వద్ద మద్యం తాగుతుండగా గుండెపోటు రావడంతో కిందపడిపోయాడు. కొద్దిసేపటి తర్వాత చుట్టుపక్కల వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తిరుపతయ్యకు భార్య నాగమ్మ ఉంది.

హోంగార్డు ఆత్మహత్యాయత్నం

మహబూబ్‌నగర్ క్రైం: ఓ పోలీస్‌స్టేషన్‌లో పెట్రోలింగ్ కారు డ్రైవర్‌గా పనిచేసే హోంగార్డు ఆత్మహత్యాయత్నం చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని ఓ పోలీస్‌స్టేషన్‌లో పెట్రోలింగ్ కారు డ్రైవర్‌గా పనిచేసే హోంగార్డు మంగళవారం ఉదయం ఇంట్లో తల వెంట్రుకలకు ఉపయోగించే బ్లాక్ యెన్నా తాగి పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడు. ఆ తర్వాత సదరు హోంగార్డు ఇబ్బంది అవుతుందని చెప్పడంతో స్థానిక పోలీసులు మొదట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి, అక్కడి నుంచి ఎస్‌వీఎస్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. అయితే హోంగార్డు ఆత్మహత్యాయత్నం చేసుకోవడానికి భార్యాభర్తల మధ్య గొడవలే కారణమని తెలుస్తోంది. భార్య సైతం మహబూబ్‌నగర్‌లో ఓ చోట హోంగార్డుగా పనిచేస్తుంది. ప్రస్తుతం ఆమెకు పోస్టింగ్ ఇచ్చిన దగ్గర విధులు నిర్వహించడంతోపాటు గతంలో పనిచేసిన ఓ పోలీస్‌స్టేషన్‌లో ప్రతిరోజు జీడీ రాయడానికి వెళ్తుంది. ఈ వ్యవహారంపై ఇద్దరి మధ్యలో గొడవ జరిగినట్లు సమాచారం. సదరు పోలీస్‌స్టేషన్‌లో ఆమె ఎందుకు జీడీ రాస్తుందనే వ్యవహారంపై స్పష్టత రావాల్సి ఉంది.

సిట్ నోటీసులు జారీ

గండేడ్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ వ్యవహారంలో గండేడ్, మహమ్మదాబాద్ మండలాల్లో పలువురికి సిట్ నోటీసులు అందినట్లు విశ్వసనీయ సమాచారం. పేపర్ లీక్‌లో గండేడ్ మండలానికి చెందిన ఏడుగురు నిందితులుగా ఉన్నారు. మన్సూర్‌పల్లితండా, పంచాంగల్‌తండా, సల్కర్‌పేట్ గ్రామాలకు చెందిన వారి ప్రమేయం ఉన్నట్లు సిట్ అధికారులు తేల్చారు. ఈ మేరకు వారిని అరెస్టు చేసి రిమాండుకు పంపిన విషయం తెలిసిందే. అయితే తాజాగా నిందితులకు సంబంధించి బంధువులతో పాటు పలువురు సన్నిహితులకు సిట్ నోటీసులు జారీ చేసింది. గండేడ్, మహమ్మదాబాద్ మండలాల్లో సుమారు పది మందికి మంగళవారం నోటీసులు వచ్చాయి. వీరిని ఈ నెల 6న తమ కార్యాలయానికి రావాలని సిట్ అధికారులు పేర్కొన్నట్లు తెలిసింది.

సరిహద్దులో అనుమతి లేకుండా సభ

- తరలివచ్చిన కర్ణాటక బీజేపీ కార్యకర్తలు
- ఇర్కిచేడు శివారులో నిర్వహణ


కర్ణాటక నాయకులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ వెంకటేష్


ఇర్కిచేడు శివారులో టెంట్లతో సభ ఏర్పాటు

కేటీదొడ్డి: తెలంగాణ కర్ణాటక సరిహద్దులో అనుమతి లేకుండా బీజేపీ నాయకులు రాజకీయ సభ నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో వెళ్లి అడ్డుకున్నారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచారం నేపథ్యంలో రాయిచూర్ జిల్లా గ్రామీణ నియోజకవర్గం అభ్యర్థులు యాపల్‌దిన్నె, ఎరిగేర తదితర పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రచారం నిర్వహిస్తున్నారు. అక్కడ ఎలక్షన్‌లు ఉండటంతో కర్ణాటక బీజేపీ నాయకులు మంగళవారం జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలం ఇర్కిచేడు శివారులో కర్ణాటక బీజేపీ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. టెంట్లు, భోజన ఏర్పాట్లు చేశారు. కర్ణాటక ఎన్నికల కోడ్ ఉన్నందున ఇర్కిచేడు గ్రామ శివారులో బీజేపీ ఈ సమావేశానికి రాయిచూర్ రూరల్ బీజేపీ అభ్యర్థితో పాటు ముఖ్యనేతలు హాజరుకావాల్సి ఉంది. అయితే సభకు రాకపోవడంతో సభ కూడా జరుగలేదు. బీజేపీ నాయకులు ఈ సమావేశాని ఏర్పాట్లు చేసినట్లు సమాచారం అందడంతో కేటీదొడ్డి పోలీసులు వెళ్లి, అనుమతి లేనందువల్ల వెంటనే తొలగించాలని ఎస్‌ఐ వెంకటేష్ సూచించారు. కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో ఉన్న వివిధ గ్రామాల నాయకులు మాట్లాడుతూ, మేము ఇక్కడ ఉన్న అమ్మవారిని పూజిస్తామని అందుకే దావత్ చేసుకోవడానికి వచ్చామని, కేవలం తినడానికి మాత్రమే వచ్చామని చెప్పారు. భోజనాల అనంతరం వెళ్లిపోయారు. ఈ విషయంపై గద్వాల డీఎస్పీ రంగస్వామి, సీఐ చంద్రశేఖర్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి అక్కడ జరిగిన విషయంపై ఆరా తీశారు.

తండ్రి మరణవార్తను దిగమింగి పరీక్షకు..

చిన్నచింతకుంట: కన్న తండ్రి చనిపోవడంతో విద్యార్థిని మంజుల పుట్టెడు దుఃఖంతోనే పదో తరగతి పరీక్షకు హాజరైంది. ఈ సంఘటన చిన్నచింతకుంటలో మంగళవారం చోటుచేసుకుంది. ఆ వివరాలు... మండల కేంద్రానికి చెందిన ముదిరాజు అంజన్న(57) సోమవారం రాత్రి గుండెపోటుతో మరణించాడు. భార్యతోపాటు ఇద్దరు కుమారులు, కూతురు మంజుల ఉంది. మంజుల ప్రస్తుతం పదో తరగతి పరీక్షలకు హాజరవుతోంది. మంగళవారం హిందీ పరీక్ష రాసి, తండ్రి అంతిమయాత్రలో పాల్గొంది.


పరీక్షకు హాజరైన విద్యార్థిని మంజుల

కన్ను పడితే కన్నమే..


నాగర్‌కర్నూల్‌లోని ఓ ఇంట్లో బీరువా పగులగొట్టి దుస్తులు చిందర వందరగా పడేసిన దొంగలు (ఫైల్)

- వరుస దొంగతనాలతో ప్రజలు బెంబేలు
- నిఘా పటిష్టంగా ఉన్నా.. ఆగని చోరీలు
- పోలీసులకే సవాల్ విసురుతున్న వైనం

నాగర్‌కర్నూల్ క్రైం: ఊరికి వెళ్తున్నారా? అయితే ఇంట్లో ఉన్న బంగారు, వెండి, నగదు వెంట తీసుకెళ్లండి. లేదంటే.. వాటి భద్రతకు నో గ్యారెంటీ. కొద్దిరోజులుగా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో చోటుచేసుకున్న వరుస దొంగతనాలే ఇందుకు నిదర్శనం. పేద, మధ్యతరగతి వారు చెమటోడ్చి కష్టపడి సంపాదించుకున్న వాటితో కొన్న బంగారు, వెండి, నగదును దొంగలు దర్జాగా దోచుకెళ్తుండటంతో లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయిస్తున్నారు. దీంతో పోలీసులు ఫిర్యాదులు స్వీకరించి కేసులు నమోదు చేయడంతోనే సరిపోతోంది. కాని రికవరీ మాత్రం ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియని తీవ్ర మనోవేదనలో బాధితులు ఉన్నారు.

రూ. లక్షల చోరీలు..

ఇటీవల సెల్‌ఫోన్లు మొదలు ఇంటి ముందు నిలిపిన ద్విచక్ర వాహనాలు ఇంట్లో భద్రపర్చిన బంగారు, వెండి, నగదుతో పాటు విలువైన ఇతర వస్తువులను దొంగలు దోచుకెళ్తుండటంతో ప్రజల్లో భయాందోళనలు పెరిగిపోతున్నాయి. కొద్దిరోజులుగా జిల్లాలో కొనసాగుతున్న వరుస దొంగతనాలతో ఇళ్లను వదిలి వెళ్లాలంటే దాచుకున్నవి దోచుకెళ్తారన్న భయం ప్రజలను వెంటాడుతోంది. జిల్లాలో దొంగతనాలను అదుపులోకి తీసుకొచ్చేందుకు పోలీసులు గస్తీ పెంచాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.


గగ్గలపల్లిలో చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)

సీసీ కెమెరాలు ఏర్పాటుచేసినా..

నేరాల అదుపునకు జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్‌లోని ప్రధాన రహదారుల వెంట, గ్రామాలు, మండల కేంద్రాల్లో మొత్తం 1,694 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ దొంగలు సీసీ కెమెరాల్లో రికార్డు కాకుండా ఉండేందుకు వైర్లు తొలగించడంతో పాటు డీవీఆర్ బాక్స్‌లను సైతం ఎత్తుకెళ్తున్నారు. అలాగే కెమెరాలు మరమ్మతులకు గురికావడం కూడా కొంత ఇబ్బందిగా మారింది. ఎక్కడైనా దొంగతనం జరిగినట్లు సమాచారం అందితే పోలీసులతో పాటు డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీం సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరిస్తున్నారే తప్పా కేసులు ఛేదించడంలో ఆలస్యం జరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దొంగలు తెలివిగా ఎలాంటి ఆధారాలు దొరకకుండా ఉండేందుకు ముఖానికి ముసుగు, చేతులకు గ్లౌసులు సైతం వేసుకుంటుండటంతో పోలీసులకు కొంత ఇబ్బందిగా మారింది.

మచ్చుకు కొన్ని..

- ➡ జనవరి 13న జిల్లాకేంద్రంలోని ఓ ఉపాధ్యాయుడి ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు 7 తులాల బంగారు నగలు, 3 కిలోల వెండి సామగ్రి చోరీ చేశారు.
- ➡ ఫిబ్రవరి 10న అచ్చంపేటలోని మహేంద్రకాలనీలో ఓ ఇంట్లో 2.5 తులాల బంగారు, 65 తులాల వెండి ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లారు.
- ➡ ఫిబ్రవరి 25న నాగర్‌కర్నూల్ మండలం గగ్గలపల్లిలో ఒకేరోజు మూడు ఇళ్లలో దొంగలు పడి 16 తులాల బంగారు, 42 తులాల వెండి, నగదు చోరీకి గురైంది.
- ➡ మార్చి 27న కల్వకుర్తి తిలక్‌నగర్‌కాలనీలోని ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు.
- ➡ మార్చి 15న లింగాల మండలం అవుసలికుంటలో ఓ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు రూ.లక్ష ఎత్తుకెళ్లారు.
- ➡ మార్చి 15న అచ్చంపేట శివసాయినగర్ కాలనీలో ఇంట్లో బీరువా తాళం విరగ్గొట్టి 2.5 తులాల బంగారం, 25 తులాల వెండి ఎత్తుకెళ్లారు.
- ➡ మార్చి 17న తాడూరు మండలం మేడిపూర్‌లో రెండు ఇళ్లలో దొంగలుపడి 5 తులాల బంగారు గొలుసు, 3 తులాల బంగారు గొలుసు ఎత్తుకెళ్లారు.
- ➡ మార్చి 19న కల్వకుర్తిలోని ఓ ఇంట్లో 4.5 తులాల బంగారం, రూ.40 వేలు చోరీ చేశారు.
- ➡ మార్చి 21న జిల్లాకేంద్రంలోని టీచర్స్‌కాలనీలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో 3.5 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి.

అదుపులోనే ఉన్నాయి..

జిల్లాలో చోరీలు అదుపులోనే ఉన్నాయి. చోరీల నియంత్రణకు పెట్రోలింగ్ పెంచడంతో పాటు గ్రామాలు, మండల కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నాం.


– మనోహర్, ఎస్పీ, నాగర్‌కర్నూల్

ప్లాస్టిక్‌ను అనుమతించం : డీఎఫ్‌ఓ

మన్ననూర్: సలేశ్వరం ఉత్సవాలకు వచ్చే భక్తులు ప్లాస్టిక్ వస్తువులను వెంట తీసుకురావద్దని.. పూర్తిగా నిషేధించామని డీఎఫ్‌ఓ రోహిత్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తుల కోసం క్లాత్, పేపర్‌తో తయారుచేసి న ప్లేట్లు, గ్లాసులు, సంచులను సమకూర్చినట్లు వివరించారు. నిబంధనలకు వ్యతిరేకంగా ప్లాస్టిక్, మద్యం, అగ్గి సంబంధిత వస్తువులు తీసుకొస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇసుక డంపులు సీజ్



పెబ్బేరు: గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 60 ట్రిప్పుల ఇసుక డంపులను రెవెన్యూ అధికారులు, పోలీసులు సీజ్ చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు కృష్ణానది నుంచి ఇసుకను అక్రమంగా తెచ్చి మండలంలోని శాఖాపూర్‌లో డంపు చేశారు. ఈ విషయమై స్థానికుల సమాచారం మేరకు మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ విజయసింహ పోలీసులతో కలిసి దాడులు నిర్వహించారు. ఇసుక డంపులకు ఎలాంటి అనుమతులు లేకపోవడంతో సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు.

రెండు టిప్పర్లు, జేసీబీ..



మానవపాడు: అనుమతి లేకుండా ఒండ్రుమట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లు, జేసీబీని పోలీసులు, మైనింగ్ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. ఇటిక్యాల మండలంలోని కొండపేట శివారు కృష్ణానది సమీపం నుంచి మూడు రోజుల నుంచి ఒండ్రు మట్టిని తరలిస్తున్నారన్న సమాచారంతో దాడులు చేసి రెండు టిప్పర్లు, ఒక జేసీబీని సీజ్ చేశారు.



గరుడవాహనంపై కోదండరాముడు

ఒంటిమిట్ట: వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్టలోని శ్రీకోదండరామాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఐదోరోజు మంగళవారం కోదండరాముడు మోహినీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 8 నుంచి 9:30 గంటల వరకు గరుడ వాహనంపై కొలువుదీరిన శ్రీరామచంద్రుడిని చూసి భక్తు లు జయజయ ధ్వానాలు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీరామచంద్రుడు బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు శివధనుర్భంగాలంకారంలో భక్తులకు దర్శనం ఇస్తారు. రాత్రి 8 నుంచి 10 గంటల వరకు పున్నమి వెన్నెలలో శ్రీసీతారాముల కల్యాణోత్సవం జరగనుంది.

కలసి నడుద్దాం.. ఘన విజయం సాధిద్దాం

- ప్రాంతీయ సమన్వయకర్తల సమావేశంలో సీఎం జగన్



సాక్షి, అమరావతి: ఎన్నికలకు మరో ఏడాది మాత్రమే సమయం ఉందని, సమన్వయంతో అంతా కలసి పనిచేయడం ద్వారా ఘనవి జయం సాధిద్దామని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ ప్రాంతీయ సమన్వయకర్తలకు దిశానిర్దేశం చేశారు. మంగళవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ప్రాంతీయ సమన్వయకర్తలతో సమావేశమైన సీఎం జగన్ పార్టీ పరంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై మార్గనిర్దేశం చేశారు. ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే సరిదిద్ది అందర్నీ ఒక్క తాటిపైకి తేవాలని సూచించారు. పార్టీ సమన్వయకర్తలుగా తనతో ఏ విషయాన్నైనా చర్చించవచ్చని, ఎప్పుడైనా కలవవచ్చన్నారు. 'పార్టీ పరంగా మీరు నా టాప్ టీమ్' అని పేర్కొన్నారు. 'మీరు, నేను, పార్టీ యంత్రాంగం అంతా కలిసి ముందుకుసాగితే ఎన్నికల్లో విజయభేరి మోగించడం తథ్యం' అని సీఎం జగన్ పేర్కొన్నారు.

రాజధానిలో పేదలు ఉండొద్దంటే ఎలా?

- రాజధాని పిటిషనర్లను ప్రశ్నించిన ఏపీ హైకోర్టు ధర్మాసనం
- ఇళ్ల స్థలాల కేటాయింపు అభివృద్ధిలో భాగమే
- ఫలానా వారికి ఇళ్ల స్థలాలివ్వొద్దని చెప్పజాలరు
- ఈ వ్యాజ్యాలు అపరిపక్వమైనవే..
- జీవో 45పై ఏ రకంగానూ జోక్యం చేసుకోలేం
- ప్రభుత్వం తీసుకునే ప్రతీ నిర్ణయంపై హైకోర్టును ఆశ్రయిస్తున్నారు

సాక్షి, అమరావతి: ''రాజధానిలో పేదలు ఉండకూడదంటే ఎలా?''అని ఏపీ హైకోర్టు ధర్మాసనం అమరావతి రైతులను ప్రశ్నించింది. రాజధాని ప్రాంతంలో రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించడం అభివృద్ధిలో భాగమని వ్యాఖ్యానించింది. ఫలానా వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వొద్దని చెప్పజాలరని స్పష్టం చేసింది. రాజధాని భూములు ప్రస్తుతం సీఆర్‌డీఏవేనని, అంతేకానీ భూములిచ్చిన వారివి కాదని పేర్కొంది. రాజధాని వ్యవహారం సుప్రీంకోర్టు పరిధిలో ఉన్నందున అందుకు సంబంధించిన వ్యవహారంలో తాము జోక్యం చేసుకుని పరిస్థితిని జటిలం చేయలేమని తెలిపింది. పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు వీలుగా రాజధాని ప్రాంతంలో 1,134 ఎకరాలను ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల కలెక్టర్లకు బదలాయించాలని సీఆర్‌డీఏ కమిషనర్‌ను ఆదేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 45 విషయంలో ఏ రకంగానూ జోక్యం చేసుకోలేమని తెలిపింది. ప్రస్తుత దశలో స్టే విధించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది. భూములను కలెక్టర్లకు బదలాయించాలని మాత్రమే ప్రభుత్వం చెప్పిందని, అందువల్ల కేటాయింపులను ప్రశ్నిస్తూ దాఖలైన వ్యాజ్యాలు అపరిపక్వమైనవని స్పష్టం చేసింది. ప్రభుత్వం తీసుకునే ప్రతీ నిర్ణయంపై హైకోర్టును ఆశ్రయిస్తున్నారని వ్యాఖ్యానించింది. రాజధాని విషయంలో కొన్ని అంశాలను హైకోర్టులో, కొన్నింటిని సుప్రీంకోర్టులో సవాల్ చేస్తున్నారని ప్రస్తావిస్తూ జీవో 45పై కూడా సుప్రీంకోర్టును ఆశ్రయించవచ్చని పేర్కొంది. నిర్ణయాలు తీసుకోకుండా ప్రభుత్వాన్ని నిరోధించలేమని, జీవో 45పై పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని పురపాలక శాఖ, సీఆర్‌డీఏలను న్యాయస్థానం ఆదేశించింది. ప్రభుత్వ కౌంటర్‌ను పరిశీలించిన తరువాతే మధ్యంతర ఉత్తర్వుల జారీ విషయాన్ని పరిశీలిస్తామని స్పష్టం చేస్తూ విచారణను ఈ నెల 19కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ మంతోజు గంగారావు ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది.

■ పేదలకు ఇళ్ల స్థలాలపై పిటిషన్లు..



రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాల నిమిత్తం 1,134 ఎకరాల భూమిని ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల కలెక్టర్లకు బదిలీ చేసేందుకు అనుమతినిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 45ను సవాల్ చేస్తూ అమరావతి రైతులు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు దామా శేషాద్రి నాయుడు, ఉన్నం మురళీధరరావు, దేవ్‌దత్ కామత్, వీఎస్ఆర్ ఆంజనేయులు తదితరులు వాదించారు. ఇళ్ల స్థలాల నిమిత్తం గతంలో జారీ చేసిన జీవోను హైకోర్టు నిలుపుదల చేసిందని మురళీధరరావు ధర్మాసనం దృష్టికి తెచ్చారు. తరువాత సీఆర్‌డీఏ చట్టానికి సవరణలు చేసి ఆర్ 5 జోన్ తెచ్చారన్నారు. ఈ సమయంలో ధర్మాసనం స్పందిస్తూ ఇళ్ల స్థలాల కేటాయింపు తమ తుది ఉత్తర్వులకు లోబడి ఉండేలా ఆదేశాలు ఇస్తామని పేర్కొనగా దీన్ని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వ్యతిరేకించారు. రాజధాని భూములను అన్యాక్రాంతం చేయడం, బదలాయించడం, థర్డ్ పార్టీ హక్కులు సృష్టించడం చేయరాదని హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం తీర్పునిచ్చిందన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా 3 అంశాలపైనే స్టే విధించిందన్నారు. మిగిలిన అంశాల విషయంలో హైకోర్టు తీర్పు అమల్లోనే ఉందని నివేదించారు.

■ పరిస్థితిని జటిలం చేయలేం..

దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. రాజధాని ప్రజలందరిదని, అది ఏ వ్యక్తిదో, వర్గానిదో కాదని స్పష్టం చేసింది. రాజధానిపై సుప్రీంకోర్టు విచారణ జరుపుతున్న నేపథ్యంలో జీవో 45 విషయంలో జోక్యం చేసుకుని పరిస్థితిని జటిలం చేయలేమని తేల్చి చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వమే సమస్యను జటిలం చేస్తోందంటూ పిటిషనర్ల న్యాయవాది దేవ్‌దత్ కామత్ సుప్రీంకోర్టు ఉత్తర్వులను చదివి వినిపించడంతో... సుప్రీంకోర్టు ఉత్తర్వులకు తమను భాష్యం చెప్పమని కోరుతున్నారా? అని ధర్మాసనం ప్రశ్నించింది. కావాలంటే సుప్రీంకోర్టుకే వెళ్లాలని స్పష్టం చేసింది. రాజధాని విషయంలో హైకోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వం ఉల్లంఘిస్తోందని పిటిషనర్ల న్యాయవాదులు పేర్కొనగా దానిపై ఇప్పటికే కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలైందని ధర్మాసనం తెలిపింది.

■ జరగని కేటాయింపులపై వ్యాజ్యాలేమిటి?

ఈ వ్యాజ్యాలను ఇప్పటికిప్పుడు విచారించాల్సినంత అత్యవసరం ఏముందో చెప్పాలని పిటిషనర్లను ధర్మాసనం ప్రశ్నించింది. ప్రతిదీ అత్యవసరమంటూ పిటిషన్లు దాఖలు చేయడాన్ని తాము ఎంత మాత్రం హర్షించబోమని, తమను ఒత్తిడి చేయవద్దని తేల్చి చెప్పింది. ఇళ్ల స్థలాల కేటాయింపులు తమ తుది ఉత్తర్వులకు లోబడి ఉంటాయని, ఈ దశగా ఉత్తర్వులు ఇస్తామని ధర్మాసనం పునరుద్ఘాటించింది. ముఖ్యమంత్రి ఓ సమావేశం నిర్వహించి పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని అధికారులను ఆదేశించారని, అందువల్లే జీవోపై స్టే కోరుతున్నామని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు నివేదించారు. 'ప్రభుత్వం పని చేయాల్సిందే కదా. నిర్ణయాలు తీసుకోకుండా ఎలా నిరోధించగలం? అసలు ఈ వ్యాజ్యాలు అపరిపక్వమైనవి. ప్రభుత్వం భూములను కలెక్టర్లకు బదలాయించాలని మాత్రమే చెప్పింది. కేటాయింపులు ఇంకా జరగలేదు. జరగని కేటాయింపులపై వ్యాజ్యాలు దాఖలు చేయడం ఏమిటి? ప్రభుత్వాన్ని కౌంటర్ దాఖలు చేయనివ్వండి. ఆ తరువాత ఏం చేయాలో చూద్దాం ...'అని ధర్మాసనం స్పష్టం చేసింది.

■ ఒత్తిడి చేసి మధ్యంతర ఉత్తర్వులు పొందలేరు..

ఈ సమయంలో సీనియర్ న్యాయవాది దామా శేషాద్రి నాయుడు స్పందిస్తూ థర్డ్ పార్టీలకు భూములు కేటాయిస్తే విషయం జటిలం అవుతుందన్నారు. తదుపరి దాఖలు చేసే వ్యాజ్యాల్లో వారందరినీ ప్రతివాదులుగా చేయాల్సి ఉంటుందని, అది ఆచరణ సాధ్యం కాదన్నారు. పిటిషనర్లు రైతులని, ఇళ్ల స్థలాల కేటాయింపు వల్ల వారి హక్కులు ప్రభావితం అవుతాయన్నారు. దీనిపై ధర్మాసనం అభ్యంతరం తెలిపింది. ఇవి ప్రజా ప్రయోజన వ్యా జ్యాలు కావని, అందరి తరఫున వ్యాజ్యాలు వేసి జీవో మొత్తాన్ని నిలుపుదల చేయాలని కోరలేరని ధర్మాసనం తేల్చి చెప్పింది. ఇళ్ల స్థలాల కేటాయింపు వల్ల ఇతరులు కూడా లబ్ధి పొందుతున్నారని గుర్తు చేసింది. ప్రస్తుత దశలో జీవో 45 విషయంలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయబోమని తేల్చి చెప్పింది. అపరిపక్వమైన వ్యాజ్యాల్లో మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడం సాధ్యం కాదంది. ఒత్తిడి చేసి మధ్యంతర ఉత్తర్వులు పొందలేరని వ్యాఖ్యానించింది. రైతులకు స్థలాలు ఇవ్వకుండా ఇతరులకు ఇళ్ల స్థలాలివ్వడం చట్ట విరుద్ధమని సీనియర్ న్యాయవాది ఆంజనేయులు వాదించారు.

ఇన్‌సైడర్స్.. అవుట్ సైడర్స్ ఏమిటి?

సీనియర్ న్యాయవాది మురళీధరరావు వాదనలు వినిపిస్తూ మే మొదటి వారంలో ఇళ్ల స్థలాలివ్వాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించినట్లు పత్రికల్లో వచ్చిందన్నారు. అవుట్‌సైడర్స్‌కు (రాజధానేతరులు) ఇళ్ల స్థలాలిస్తూ వివాదాలు సృష్టించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని పేర్కొనడంపై ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. రాజధాని ప్రజలందరిదీ, కేవలం పూలింగ్ కింద భూములిచ్చిన వారిది మాత్రమే కాదని పేర్కొంది. అవుట్ సైడర్స్, ఇన్‌సైడర్స్ అంటూ మాట్లాడొద్దని సూచించింది. రాజధాని భూములను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఇళ్ల స్థలాల కేటాయింపు ద్వారా అదే జరుగుతోందని తెలిపింది.

విచారణపై స్టే ఇవ్వలేం

మార్గదర్శి పిటిషన్‌లో తెలంగాణ హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: మార్గదర్శి విషయంలో ఏపీ సీఐడీ విచారణపై స్టే ఇవ్వలేమని, దర్యాప్తు కొనసాగించుకోవచ్చని తెలంగాణ హైకోర్టు స్పష్టంచేసింది. అయితే, తాము తదుపరి ఆదేశాలిచ్చే వరకు 30 మంది మేనేజర్లపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని ఏపీ సర్కార్‌ను ఆదేశించింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు వెలువరుస్తూ తదుపరి విచారణను ఈ నెల 20వ తేదీకి వాయిదా వేసింది. ఖాతాదారుల నుంచి వసూలు చేసిన నిధులను చట్ట విరుద్ధంగా అక్రమ మార్గాలకు మళ్లిస్తున్నారని పేర్కొంటూ ఏపీ సీఐడీ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే, ఈ కేసుల్లో తమపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకుండా ఆదేశాలు జారీచేయాలని కోరుతూ మార్గదర్శి చైర్మన్ రామోజీరావు (ఏ1), ఎండీ శైలజ (ఏ2) ఇటీవల తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు.. దర్యాప్తులో భాగంగా విచారణకు రావాలని 30 మంది మార్గదర్శి మేనేజర్లకు సీఐడీ తాజాగా నోటీసులు జారీచేసింది. ఈ నోటీసులను సవాల్ చేస్తూ రామోజీరావు, శైలజ మంగళవారం ఇంటర్లొక్యుటరీ అప్లికేషన్‌ను లంచ్ మోషన్‌గా దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ బి. విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూథ్రా వాదనలు వినిపిస్తూ.. ఉద్యోగులకు జారీచేసిన నోటీసులను కొట్టేయాలన్నారు. మార్గదర్శి కేసు దర్యాప్తును మరో రాష్ట్రానికి బదిలీచేసి.. స్వతంత్ర ఏజెన్సీకి అప్పగించేలా ఆదేశాలు జారీచేయాలని కోరారు.

పిటిషన్లు దాఖలు చేస్తూనే ఉన్నారు..

ఏపీ ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ గోవింద్‌రెడ్డి వాదనలు వినిపించారు. 'గత విచారణ సందర్భంగా హైకోర్టు కేవలం రామోజీ, శైలజకు మాత్ర మే ఉపశమనం కలిగించింది. ఇతరులకు ఈ ఇది వర్తించదు. దర్యాప్తు ప్రారంభమైన నాటి నుంచి పిటి షనర్లు పిటిషన్లు దాఖలు చేస్తూనే ఉన్నారు. ఏపీ ప్ర భుత్వానికి సమయం ఇవ్వకుండానే పిటిషనర్లకు అ నుకూలంగా ఆదేశాలు జారీ అవుతున్నాయి. ఈ కే సులో ఏపీ అడ్వొకేట్ జనరల్ హాజరై వాదనలు వినిపిస్తారు. ఏపీ వాదన విన్న తర్వాతే మధ్యంతర ఉత్తర్వులు జారీచేయాలి. అప్పటివరకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వొద్దని విజ్ఞప్తి చేస్తున్నా. ఏపీ సీఐడీ నుంచి నోటీసులు అందుకున్న ఉద్యోగులు ఎవరో, ఎప్పుడు నోటీసులు అందుకున్నారో.. లాంటి వివరాలు ఏమీలేకుండానే పిటిషన్ వేశారు. వివరా లు తెలీకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం సరికాదు. మార్గదర్శి నిధులను మ్యూచ్‌వల్ ఫండ్స్, షేర్స్‌లోకి మళ్లించడం ద్వారా భారీ కుంభకోణానికి పాల్పడింది. కౌంటర్ దాఖలు చేసే వరకైనా మాకు సమయం ఇవ్వాలి' అని గోవింద్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

దర్యాప్తును అడ్డుకోవడం లేదుకదా..

'మీకు (ఏపీ సర్కార్) అభ్యంతరం ఉంటే రేపే వెకేట్ స్టే పిటిషన్ వేయండి. హౌస్‌మోషన్ మూవ్ చేయండి.. మా ఆదేశాల సవరణకు పిటిషన్ వేయండి.. విచారణ చేపట్టడానికి మాకెలాంటి అభ్యంతరంలేదు. మేం దర్యాప్తును అడ్డుకోవడంలేదు కదా. మా ఆదేశాలపై అభ్యంతరాలు వ్యక్తంచేయడం సరికాదు'.. అని న్యాయమూర్తి పేర్కొన్నారు. తదుపరి విచారణను ఈనెల 20కి వాయిదా వేశారు.

రామోజీ అతీతుడా!?

▶ మొదటి పేజీ తరువాయి

కంపెనీకి చెందిన ఓ సీఏను అరెస్టు చేస్తే అందుకు నేను బాధ్యుడినా? అది అందరు సీఏలపై దాడి ఎలా అవుతుంది? అరెస్టులకు సంబంధించి విజయవాడలో సీఏలు సమావేశం పెట్టి సీఎం జగన్‌కు వ్యతిరేకంగా ఎందుకు మాట్లాడటంలేదని దూషించడం తగదు'.. అని ఉండవల్లి అన్నారు. సీఏలు ప్రభుత్వానికి ప్రతినిధుల్లాంటి వారని, వాళ్లు తప్పు చేస్తే శిక్షలు ఉంటాయని గుర్తుచేశారు. సత్యం రామలింగరాజు కేసులో సీఏలను అరెస్టుచేసిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. కానీ, అప్పట్లో సీఏలు ఇలా మీటింగ్ పెట్టి విమర్శించిన దాఖలాల్లేవన్నారు. సీఏలు మీటింగ్ పెట్టి ఆహ్వానిస్తే వెళ్లి రామోజీ తప్పుచేశారన్న తన వాదన నిజామా? కాదో వివరిస్తానన్నారు.

నా కేసు తప్పని జస్టిస్ రమణతో చెప్పించండి

ఇక మార్గదర్శిపై తాను వేసిన కేసు తప్పని సుప్రీంకోర్టు మాజీ సీజే జస్టిస్ రమణతో చెప్పిస్తే చాలని ఉండవల్లి అన్నారు. రామోజీరావు చేసింది తప్పా కాదా? అని మాత్రమే సమాధానమివ్వాలన్నారు. తప్పని తేలితే రూపాయి ఫైన్ వేసినా సంతోషమేనని, మిగిలిన చిట్‌ఫండ్‌లకు భయం ఉంటుందన్నారు. సెక్షన్ 477–ఏ ప్రకారం అకౌంట్స్ తారుమారు చేస్తే శిక్ష తప్పదని.. రామోజీరావుకు డిపాజిటర్ల పేర్లు విడుదల చేయాలని ఉండవల్లి డిమాండ్ చేశారు. అవినీతిని ప్రశ్నిస్తే రామోజీరావు పత్రికా స్వేచ్ఛపై దాడిగా చెప్పుకుంటారని.. అలాంటప్పుడు చట్టసభల్లో పత్రికాధిపతికి చట్టాలు వర్తించవని చట్టం తీసుకురావాలని ఉండవల్లి సలహా ఇచ్చారు.

జగన్‌ను విమర్శిస్తే విశ్వాస ఘాతుకుడినే..

తనకు టీడీపీ, వైఎస్సార్‌సీపీ రెండు పార్టీలు సమానమేనని ఆయనన్నారు. రాష్ట్ర విభజన అంశంపై కోర్టులో కేసు వేయమని టీడీపీ ప్రభుత్వ హయాంలో అడిగితే పట్టించుకోలేదని.. అదే విషయమై ఇప్పుడు కోరితే తనను సపోర్ట్ చేస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తన కేసులో ఇంప్లీడ్ అవుతూ అఫిడవిట్ దాఖలు చేసిందన్నారు. ఎవరూ చేయలేని పని జగన్ చేశారని.. అలాంటప్పుడు కేసు తేలేవరకైనా కృతజ్ఞత లేకుండా ముఖ్యమంత్రి జగన్‌ను ఎందుకు విమర్శించాలని ఆయన ప్రశ్నించారు. అలా చేస్తే తాను విశ్వాస ఘాతకుడినవుతానన్నారు.

భక్తిశ్రద్ధలతో సీతారామ చంద్రస్వామి గజసేవ



పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు

చారకొండ: మండలంలోని సిర్సనగండ్లలో సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. సోమవారం ఉదయం పెద్ద రథోత్సవం అనంతరం మంగళవారం ఉదయం వరకు భక్తులు భారీగా అలయ ప్రాగణంలో మొహరించారు. సోమవారం రాత్రి స్వామి వారికి పల్లకీ సేవ, అభిషేకం కార్యక్రమాన్ని అలయ చైర్మన్ రామశర్మ, ఈఓ రఘు, మేనేజర్ నిరంజన్, అలయ పూజారులు లక్ష్మణ్ శర్మ, మురళీధర్ శర్మ, ప్రవీణ్ శర్మ, వేణుగోపాల్ శర్మ నిర్వహించారు.

1,017 అడుగుల నీటి మట్టం

మదనాపురం: రామన్‌పాడు జలశయంలో మంగళవారం 1,017అడుగుల మేర నీటి మట్టం ఉంది. జూరాల ఎడమ కాల్వకు సమాంతర కాల్వ నీటిని నిలిపివేశారు. రామన్‌పాడు నుంచి ఎన్‌టీఆర్ కాల్వకు సాగునీటిని సైతం నిలిపివేశారు. తాగునీటి అవసరాల కోసం 20క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీ.. కార్మికుడు మృతి

వంగూర్: మండల పరిధిలోని శ్రీశైలం హైవేపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ కార్మికుడు మృతి చెందాడు. వంగూర్ ఎస్ఐ కురుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్‌కు చెందిన కుషల్(33) కొంతకాలంగా వంగూరు గేట్ సమీపంలోని ఓ పత్తిమిల్లులో పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి మిల్లులో తన విధులు ముగించుకొని అతడు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన కుషల్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కత్వా.. కనువిందు





మండు వేసవిలోనూ ఓ కత్వ కనువిందు చేస్తోంది. కొల్లాపూర్ నియోజకవర్గంలోని పెంట్లవెల్లి, జటప్రోల్ గ్రామాల మధ్యన కృష్ణానది బ్యాక్‌వాటర్ ఏరియాలో కత్వ అలుగుపై పారుతున్న జలపాతం ప్రజలకు ఆహ్లాదం పంచుతోంది. సింగోటం రిజర్వాయర్ ద్వారా వాగుకు రామాపురం, పెంట్లవెల్లి మీదుగా నిరంతరాయంగా నీరు పారుతుండటంతో.. కృష్ణానది బ్యాక్‌వాటర్ తగ్గిన తర్వాత కత్వ తేలి 10 అడుగుల ఎత్తు నుంచి నీళ్లు జాలువారుతాయి. ఈ జలపాతాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు. – కొల్లాపూర్/ పెంట్లవెల్లి

పరిశీలనలోనే పునరావాసం!

- కానాయపల్లి ముంపు గ్రామాన్ని పరిశీలించిన కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్
- నేటికీ పునరావాసం కల్పించకపోవడంపై గ్రామస్తుల ఆవేదన



కానాయపల్లి పునరావాస స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్

కొత్తకోట: రిజర్వాయర్ నిర్మాణంలో ముంపుకు గురైన కానాయపల్లి గ్రామాన్ని, పునరావాస స్థలాన్ని మొదటిసారిగా వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మంగళవారం పరిశీలించారు. ఆయనతో పాటు కొత్తకోట తహసీల్దార్ బాల్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, వైస్ ఎంపీపీ శ్రీనివాసులు, గ్రామపెద్దలు రావుల సురేంద్రనాథ్‌రెడ్డి ఉన్నారు. రిజర్వాయర్‌గా మారుతున్న కానాయపల్లి గ్రామ ముఖచిత్రంతో పాటు, కొత్తగా ఏర్పాటు చేస్తున్న పునరావాస స్థలాన్ని ఆయన పరిశీలించారు. రైతులకు, గ్రామస్తులకు ఇప్పటివరకు అందిన పరిహారం వివరాల గురించి గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. వనపర్తి రోడ్డులోని కానాయపల్లి గ్రామస్తులకు కేటాయించిన పునరావాస స్థలంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఏళ్లు గడుస్తున్నా కానాయపల్లి గ్రామ ప్రజలకు పునరావాసం కల్పించకపోవడం బాధాకరమన్నారు. రిజర్వాయర్ నిర్మాణంతో ఇళ్లు కోల్పోయిన వారికి స్థలం కేటాయింపు పనులు జరిగినట్లు పేర్కొన్నారు. కాగా గ్రామప్రజలు మరిన్ని డిమాండ్లు ప్రభుత్వం ముందు ఉంచారని, వాటిని సాధ్యమైనంత తొందరగా పరిష్కరించే దిశగా తనవంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా కలెక్టర్ హామీ ఇచ్చారు.

పునరావాసం లేదని గ్రామస్తుల ఆవేదన..

కానాయపల్లి గ్రామం ముంపునకు గురై 15 ఏళ్లు పూర్తవుతున్నా నేటికీ పునరావాసం పరిశీలనలకే పరిమితమైందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్అండ్ఆర్ ప్రకారం ముందుగా పునరావాసం కల్పించాకే రిజర్వాయర్ పనులు చేపట్టాలని గుర్తు చేశారు. అధికారులు ఇంకా ఆలస్యం చేసే కొద్దీ రకరకాల ఇబ్బందులు వస్తాయని పేర్కొన్నారు. కానాయపల్లి శంకరసముద్రాన్ని 2007లో రిజర్వాయర్‌గా మార్చారని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పటి నుంచి నేటి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వరకు ఎందరో కలెక్టర్లు మారినా పునరావాస పనులు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయన్నారు. కలెక్టర్లు మారడంతో కొత్తగా వచ్చిన వారితో పునరావాసానికి చెందిన పలు విషయాలు తెలుసుకునేందుకే సమయం సరిపోతుందని, ఇంతలో మరో కలెక్టర్ రావడం, సమస్య మొదటికి రావడం పరిపాటిగా మారిందని వాపోయారు. పునరావాసం పేరుతో గ్రామంలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగక జనం దుర్భర జీవితం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామానికి ఎలాంటి సంక్షేమ పథకాలు అందడం లేదని తెలిపారు.

సమాజసేవలో భారత్ వికాస్ పరిషత్ భాగస్వామ్యం

బీవీపీ ఆలిండియా ప్రధాన కార్యదర్శి శ్యామ్‌శర్మ



ఆలిండియా అధ్యక్షుడు శ్యామ్‌శర్మను సన్మానిస్తున్న బీవీపీ ప్రతినిధులు

స్టేషన్ మహబూబ్‌నగర్: సమాజసేవల్లో భారత్ వికాస్ పరిషత్ భాగస్వామ్యం అవుతున్నట్లు బీవీపీ ఆలిండియా ప్రధాన కార్యదర్శి శ్యామ్‌శర్మ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఆ సంస్థ కార్యాలయంలో మంగళవారం బీవీపీ జిల్లాశాఖ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీవీపీ పాలమూరు శాఖ రాష్ట్రంలోనే అన్ని శాఖల కంటే ప్రముఖంగా పనిచేస్తున్నట్లు కొనియాడారు. జిల్లాశాఖ పనితీరు తెలుసుకోవడానికే జిల్లాకు వచ్చినట్లు తెలిపారు. బీవీపీ సభ్యుల కుటుంబాలతో ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేయాలని సూచించారు. భవిష్యత్‌లో మరిన్ని సామాజికసేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. బీవీపీ సౌతిండియా రీజినల్ అధ్యక్షులు కేఎస్‌వీఆర్ ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాశాఖ ద్వారా ఎనీమియా ముక్త్‌భారత్ కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలన్నారు. బాలికలకు రక్తహీనత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయాలని కోరారు. అనంతరం ఆలిండియా అధ్యక్షుడిని ఘనంగా సన్మానం చేశారు. సమావేశంలో భారత్ వికాస్ పరిషత్ రాష్ట్రశాఖ అధ్యక్షులు నరేంద్రక్రిష్ణ, కార్యదర్శి నాగరాజు, పాండురంగం, రమేష్ చందర్, వీఎస్ఆర్‌కే ప్రసాద్, భూషణ్‌పాండే, చంద్రుడు, నాగేంద్రస్వామి, నారాయణరావు, చంద్రకుమార్‌గౌడ్, యతిరాజచారి, గుప్త, సురేష్ దూత్, శివన్న, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మూకుమ్మడి దాడి

- నలుగురికి గాయాలు.. రెండు బైకులు ధ్వంసం



గాయపడ్డ చంద్రయ్య



దాడిలో ధ్వంసమైన బైక్‌లు

గండేడ్: అమ్మాయిని వేధించడానికి అడిగిన పాపానికి ఆ కుటుంబంపై మూకుమ్మడిగా దాడిచేసిన ఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. మన్సూర్‌పల్లితండాకు కాస్తదూరంలో రెడ్డిపల్లికి చెందిన గాజుల చంద్రయ్య, ఆయన తమ్ముడు కృష్ణయ్య కుటుంబం పొలంలోనే ఇల్లు కట్టుకొని కొంతకాలంగా వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరి కుటుంబంలో ఓ బాలిక పదోతరగతి పరీక్షలు రాస్తోంది. సోమవారం చంద్రయ్య అక్క కుమారుడు వేణు బాలికను పరీక్షకు బైక్‌పై తీసుకెళ్తుండగా కొత్లాబాద్ రాజు వేధించాడు. ఈ విషయాన్ని వేణు తన మామ చంద్రయ్యకు తెలిపారు. దీంతో చంద్రయ్య రాజు తండ్రి అంజిలయ్య వద్దకు వెళ్లిజరిగిన విషయాన్ని చెప్పాడు. దీన్ని దృష్టిలో ఉంచుకొని అర్ధరాత్రి 12 గంటల సమయంలో రాజు కుటుంబీకులు, కొందరు స్నేహితులు, బంధువులు కలిసి చంద్రయ్య ఇంటిపై దాడి చేసి బయట పడుకున్న చంద్రయ్య, కృష్ణయ్యతో కుటుంబ సభ్యులను రాళ్లు, కర్రలతో బాదారు. ఓ గది తలుపు సైతం విరగ్గొట్టారు. అక్కడే ఉన్న రెండు బైకులను సైతం ధ్వంసం చేశారు. ఈ ఘటనలో చంద్రయ్య, కృష్ణయ్య, రాజమ్మ, కృష్ణవేణి గాయలయ్యాయి. కొంత బంగారం కూడా పోయినట్లు బాధితులు తెలిపారు. క్షతగాత్రులు మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదయ్య తెలిపారు.

శనేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



బిజినేపల్లి: జేష్ఠాదేవి సమేత శనేశ్వరుడి 23వ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. మండలంలోని నందివడ్డెమాన్‌లో మొదటి రోజు ఆలయ ప్రధాన అర్చకులు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి ఆధ్వర్యంలో బ్రహ్మసూత్ర శివుడికి, నందీశ్వరునికి ప్రత్యేక ద్రవ్యాలతో రుద్రాభిషేకం, అన్నాభిషేకాన్ని వేదమంత్రోచ్ఛరణల నడుమ నిర్వహించారు. ఈ అభిషేకాల వల్ల దరిద్ర్యాలు, పాపాలు తొలగుతాయని అన్నారు. పూజల్లో ఆలయ అర్చకులు, భక్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.